ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శనివారం 9 మార్చి 2024 | 5



అమలాపురంలోని ఓంశాంతి కేంద్రంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకల సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో ఓ విద్యార్థిని చేస్తున్న శివనృత్య ప్రదర్శన ఇది..

హరహర మహాదేవ..



ద్రాక్షారామంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

- జిల్లావ్యాప్తంగా కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ద్రాక్షారామ, కోటిపల్లి, ముక్తేశ్వరం, మురమళ్ల, కుండలేశ్వరం తదితర చోట్ల పోటెత్తిన భక్తులు

శివ.. శివా అంటూ పరమశివుడిని స్తుతిస్తూ భక్తులు వేకువజాము నుంచే శైవక్షేత్రాలకు పోటెత్తారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేశారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన అన్ని ఆలయాల్లోనూ భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాది జనం ప్రముఖ ఆలయాలకు తరలిరావడంతో అయా ఆలయ ప్రాంగణాలన్నీ కిటకిటలాడిపోయాయి. ముఖ్యంగా జిల్లాలోని పంచారామక్షేత్రమైన ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయానికి వేలాది మంది క్యూకట్టారు. అలాగే కోటిపల్లిలోని ఛాయాసోమేశ్వరస్వామి ఆలయానికీ అదే రీతిలో భక్తులు విచ్చేశారు. ఇక మురమళ్ల, ముక్తేశ్వరం, కుండలేశ్వరం తదితర చోట్ల కూడా శైవ క్షేత్రాలకు భక్తజనం పోటెత్తారు. ఓం నమశ్శివాయ అంటూ శివనామస్మరణలతో ఆ ఆలయాలన్నీ మార్మోగిపోయాయి. అలాగే సాయంత్రం వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.



ముక్తేశ్వరంలో ముక్తికాంత క్షణముక్తేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ముక్తేశ్వరంలో వైభవంగా రుద్రాభిషేక, పంచామృత అభిషేకాలు

అయినవిల్లి, మార్చి 8: శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ముక్తేశ్వరంలో ముక్తికాంత క్షణముక్తేశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత విశ్వేశ్వరాలయం, అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలను సందర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా శైవాగమోక్త ప్రకారం మహాన్యాసాది రుద్రాభిషేక పూజలు, పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సత్తిబాబుశర్మ పూజలు నిర్వహించారు. ముక్తేశ్వరంలో పళ్లస్వామి చారిటబుల్ ట్రస్టు, శ్రీకాకోళపు కృష్ణమూర్తి సత్రం, విశ్వబ్రాహ్మణ సంఘం అన్నసమారాధన చేశాయి.



వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న దృశ్యం

శివనామ స్మరణతో మార్మోగిన మురమళ్ల

ఐ.పోలవరం, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా మురమళ్ల శ్రీభద్రకాళీ వీరేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో హోరెత్తింది. వేకువజాము నుంచి భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలాచరించి వీరేశ్వరస్వామి దర్శనం కోసం బారులుతీరారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, పలువురు ప్రముఖులు వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితులు నాగభట్ల రామకృష్ణమూర్తి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కొత్త మురమళ్ల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి పుష్కర నదీజలాలతో అభిషేకం చేశారు. నిత్యకల్యాణ బ్రహ్మ నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ అభిషేకం జరిగింది. తొలుత నదీజలాల కలశాలను పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులతోపాటు భక్తులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఇమ్మిడివరప్పాడులో ట్రాక్టర్లపై అలుగులు ధరించి ఊరేగుతున్న యువకులు

లింగధారుల అలుగుల సంబరం

అమలాపురం రూరల్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లింగధారులైన కరికాళ భక్తులు శుక్రవారం అలుగుల సంబరాలు నిర్వహించారు. యువకుల రెండు బుగ్గలను కలిపిన అలుగులు(శూలాలు) ధరించి పరమశివుని స్మరిస్తూ ట్రాక్టర్లపై గ్రామోత్సవం నిర్వహించారు. తరతరాలు నాటి ఆచారాన్ని, సంప్రదాయ బద్ధంగా ప్రతీ ఏటా రంగాపురం, ఇమ్మిడివరప్పాడు గ్రామాల్లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వీరభద్రుని సంబరాలు కరికాళ భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఆయా గ్రామాల్లోని స్థానిక వీరభద్రుని ఆలయాల వద్ద నుంచి అలుగులు ధరించిన యువకులను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగించారు. రాత్రి ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన నిప్పుల గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ప్రభలను గ్రామాల్లో ఊరేగించారు. అఖండ దీపారాధనలు చేశారు.







ఆకర్షణీయం.. ఆధ్యాత్మికం

మహాశివరాత్రి సందర్భంగా అప్పనపల్లిలో మైనరురాజు ఆధ్వర్యంలో శ్రీబాలగణపతి మిత్ర బృందం ఆధ్వర్యంలో 10,116 దీపాలతో ఏర్పాటుచేసిన అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే వివిధ రూపాల్లో ఏర్పాటుచేసిన సెట్టింగ్‌లు భక్తులకు కనువిందు చేశాయి. కొన్ని దృశ్యాలివి..

\- మామిడికుదురు

అదే ఉత్కంఠ!



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- అభ్యర్థుల ఎంపికపై దృష్టిపెట్టిన ప్రధాన పార్టీలు
- టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాటులో కొలిక్కి వచ్చేనా
- అమలాపురం టీడీపీకా.. జనసేనకా..?
- మాకే ఖరారైందంటూ ఆయా పార్టీల నేతల ప్రచారం
- అమలాపురం ఎంపీ వైసీపీ సమన్వయకర్తగా రాపాక
- రాజోలు వైసీపీ సమన్వయకర్తగా గొల్లపల్లి ఖరారు



సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మరికొన్ని రోజుల్లో వెలువడనున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఆయా నియోజకవర్గాలకు సమర్థులైన అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాట్లో ఏర్పడ్డ ప్రతిష్టంభన తొలగిపోనుంది. వైసీపీ అధిష్ఠానం టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటన వెలువడిన తరువాతే ఆ పార్టీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయనేది విశ్వసనీయ సమాచారం. అయితే శుక్రవారం రాత్రి రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఇటీవలే ఆ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావును ఖరారు చేస్తూ అధిష్ఠానం ప్రకటన చేసింది. అలాగే ఇక్కడ ప్రస్తుత సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ను అమలాపురం పార్లమెంటు సమన్వయకర్తగా ఖరారుచేసింది. ఇక జిల్లా పరిధిలోని మిగిలిన స్థానాలకు వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకుండా జాప్యం చేస్తుండడంతో వారిలో ఒకింత ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం హడావుడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు పరిమితమై వైసీపీకి చెందిన సిటింగ్ ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నప్పటికీ ఎన్నికల ప్రచారం దిశగా ఏర్పాట్లు చేసుకోకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు నేపథ్యంలో సీట్ల సర్దుబాటు చివరి దశలో ఉంది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా నుంచి ఒక స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారా అనేది తాజాగా తెరపైకి వచ్చింది. గతంలో బీజేపీ గెలిచిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఆ పార్టీ తరపున దళిత అభ్యర్థిని బరిలోకి దింపే అవకాశాలు ఉన్నట్టు జిల్లా బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. అయితే అటువంటి ప్రతిపాదన లేదని మారిన తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశాలపై పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఆ స్థానాన్ని టీడీపీ అభ్యర్థిగా మహాసేన రాజేష్ పేరును ఖరారు చేయడంతో అక్కడి నుంచి టీడీపీ పోటీ చేస్తుం దా, లేక జనసేనకు ఇస్తారా లేక మధ్యేమార్గంగా బీజేపీకి కేటాయిస్తారా అనేది జిల్లాలో ఉత్కంఠభరితంగా మారింది. ఒకవేళ అది జనసేన, బీజేపీకికాని కేటాయిస్తే అమలాపురం ఎస్సీ రిజర్వుడు స్థానం టీడీపీకే కేటాయించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గీయులు ఢంకాపథంగా ప్రచారం చేస్తున్నారు. అమలాపురంస్థానంపై అభ్యర్థులపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతుండడంతో ఉత్కంఠ రాజకీయాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక జనరల్ స్థానమైన రామచంద్రపురం స్థానం విషయంలో టీడీపీనా, జనసేనా అనేది తాజాగా ఉత్పన్నమవుతున్న ప్రశ్న. అమలాపురం టీడీపీకి కేటాయిస్తే జనసేన రామచంద్రపురం అడిగే అవకాశం ఉన్నట్టు పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో వైసీపీ ఎంపీ ప్రకటన వెలువ డడంతో ఎమ్మెల్యే అభ్యర్థులను మాత్రమే ఇక ఆ పార్టీ ప్రకటించాల్సి ఉంది. కొన్ని ఎమ్మెల్యేల అభ్యర్థిత్వాల విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రకటించే అభ్యర్థుల ఆధారంగా ఎంపిక జరగవచ్చని తాజా సమాచారం బట్టి తెలుస్తోంది. అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా వైసీపీ నుంచి తాను పోటీ చేస్తానని రాజోలు సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన స్వీయ ప్రకటన మేరకే అధిష్ఠానం కూడా ఆ టిక్కెట్టును కేటాయించినట్టు అయింది. ఇటు రాజోలులో నెలకొన్న ఉత్కంఠతకు కూడా తెరపడింది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు లైన్‌క్లియర్ అయిపోయినట్టే. ఇక అమలాపురం నుంచి మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కొత్తపేట నుంచి చిర్ల జగ్గిరెడ్డిల పేర్లను అధిష్ఠానం ప్రకటించకపోవడంతో ఆయా నియోజకవర్గాల వైసీపీ శ్రేణులు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి. పి.గన్నవరం వైసీపీ సమన్వయకర్తగా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, రామచంద్రపురం వైసీపీ సమన్వయకర్తగా పిల్లి సూర్యప్రకాష్, మండపేట నుంచి తోట త్రిమూర్తులు పేర్లను ఇప్పటికే అధిష్ఠానం ప్రకటించింది. దాంతో మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటన కోసం వైసీపీ కేడర్ ఎదురుచూస్తోంది. ఎందు కింత మిగిలినచోట్ల తాత్సారం చేస్తోందన్న చర్చ తాజాగా నడుస్తోంది.



గ్యాస్.. రూ.100 తగ్గింది!

అమలాపురం, మార్చి 8: సాధారణ గృహ వినియోగదారులు వినియోగించే వంట గ్యాస్ ధరను రూ.100 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం డొమెస్టిక్ వంట గ్యాస్ ధర రూ.933గా ఉంది. రూ.100 తగ్గించడంతో ఈ ధర రూ.833కు చేరుతుంది. శనివారం నుంచి ఇది అమల్లోకి వస్తుందని కేంద్రం చెప్పింది. ఆ మేరకు బిల్లింగ్‌లో మార్పులు జరిగినట్టు గ్యాస్ ఏజెన్సీ వర్గాలు తెలియజేశాయి. అయితే ఇప్పటికే గ్యాస్ బుక్ చేసుకున్నవారికి మాత్రం ఈ ధరలు వర్తించే అవకాశం లేదు. ప్రస్తుతం గ్యాస్ సబ్సిడీ నామమాత్రంగానే ఉంది. గ్యాస్ సిలిండర్ కేంద్రం ఇప్పుడు రూ.100 తగ్గించినా సబ్సిడీ మాత్రం పెరగలేదు.



సదస్సు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి రెండు రోజులపాటు కాకినాడలో తెలుగు సాహితీ సదస్సు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి8: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో కాకినాడలో ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజులపాటు అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో శని, ఆదివారాల్లో జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచ్చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్ వంగూరి చిట్టెన్‌రాజు, ఆహ్వాన సంఘ సభ్యుడు మార్ని జానకిరామ్‌చౌదరి తదితరులు పర్యవేక్షించారు. అనంతరం చిట్టెన్‌రాజు మాట్లాడుతూ ఫౌండేషన్ 30వ వార్షికోత్సవ సందర్భంగా కాకినాడలో మొదటిసారిగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వందమందికిపైగా సాహితీవేత్తలతో ఎనిమిది వేదికలతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత భువనచంద్రకు జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నామన్నారు. సదస్సులో రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, బేతవోలు రామబ్రహ్మంతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.



అమలాపురంలో జిల్లా తెలుగు మహిళల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి

ఆడబిడ్డల కోసం కూటమి 'కలలకు రెక్కలు' పథకం

అమలాపురం టౌన్, మార్చి8: టీడీపీ, జనసేన కూటమితోనే మహిళల కలలు సాకారమవుతాయని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆడబిడ్డలు ఆర్థిక ఇబ్బందులకు చదువు మానేయకుండా వారికోసం ప్రత్యేకంగా 'కలలకు రెక్కలు' అనే కొత్త పథకానికి కూటమి శ్రీకారం చుట్టిందని వివరించారు. అమలాపురం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అర్హతతో కలలకు రెక్కలు పథకంలో చేరవచ్చన్నారు. విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులను బ్యాంకు రుణాల ద్వారా పొందినా దానికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 9261292612 నంబరుకు డయల్‌చేసి లింకును పొంది ప్రతీ ఆడబిడ్డ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళలు మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, వేగిరాజు వెంకటసత్యప్రవీణ, మట్టపర్తి భారతి, పేరూరి విజయలక్ష్మి, గెల్లా మీనాకుమారి, అప్పారి సుశీల, ఆకుల శాంత, యనమదల లక్ష్మి, నిమ్మకాయల పద్మ, కాంద్రేగుల వాణీఅచ్యుతం, గుమ్మడి నాగమణి, లక్కింశెట్టి సూర్యకుమారి, ముత్తాబత్తుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

'ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకే అధిక ప్రాధాన్యం'



పి.గన్నవరం,మార్చి8: టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పి.గన్నవరంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు చేయూత, ఆసరా ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటారని అన్నారు. మహిళల కోసం తమ నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ముఖ్యమైన పథకాలు రూపొందించారని, ఉచిత బస్సు, విద్యార్థినిలను విద్యాపరంగా ఆదుకోవడం, ఉచిత గ్యాస్ సిలెండర్లు వంటి పథకాలతో మహిళలను ముందంజలో ఉంచారన్నారు. జగన్‌కు వచ్చే ఎన్నికల్లో మహిళలందరూ గట్టిబుద్ధి చెప్పాలని కోరుతూ మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.



రావులపాలెం సీఆర్సీలో ఓటర్ల లిస్టులతో మల్లాగుల్లాలు పడుతున్న దృశ్యం

ప్రత్యర్థి ఓట్లే టార్గెట్టా..!

సీఆర్సీలో వైసీపీ సమావేశాలతో సర్వత్రా చర్చ

రావులపాలెం, మార్చి8: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకోసం ప్రత్యర్థి ఓటర్ల గుర్తింపుతో టార్గెట్ చేసేందుకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రావులపాలెం సీఆర్సీ వేదికగా బూత్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ముఖ్య నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్ల జాబితాలతో మల్లగుల్లాలు పడుతుండడంతో చర్చనీయాంశంగా మారింది. అక్కడ జరిగే కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సమావేశం మాదిరిగా సమావేశం ఏర్పాటుచేసి ఓటర్ల లిస్టులతో 2019 ఎన్నికల్లో బూత్ వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి, ఏ పార్టీకి ఎన్ని వచ్చాయనే అంశంపై నమోదు ప్రక్రియ చేపట్టినట్టు తెలుస్తోంది. మండలం యూనిట్‌గా ఏ మండలానికి ఆ మండలం పిలిపించి సమావేశం నిర్వహించి వారికి విందు భోజనాలతో మర్యాదలు చేస్తున్నట్టు గుసగుసలాడుకుంటున్నారు. అదేవిధంగా నూతన జాబితాలో ఇతర దేశాలకు వెళ్లిన వాళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వృద్ధులు, నడవలేక ఇంటి వద్దే ఉండిపోయే వారి వివరాలు నమోదు చేసినట్టు సమాచారం. ఇప్పటికే ఎన్నికల సమయంలో తనకు అనుకూలంగా పనిచేసే విధంగా అధికారులను తెచ్చుకున్నట్టు విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ సమావేశాలు నియోజకవర్గంలో హట్‌టాపిక్‌గా మారింది. అదేవిధంగా వీరికి నగదు బహుమతులు ఇచ్చినట్టు పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఎంపీపీ, అతడి సోదరుడి నుంచి ప్రాణహాని : ఓ రైతు ఫిర్యాదు

మండపేట, మార్చి8 : మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన గంధం గంగాధర్‌కు గ్రామంలో 7.36 ఎకరాల మెట్టపొలం ఉంది. దాన్ని 2015 నుంచి 2020వరకు గ్రామానికి చెందిన ఉండమట్ల తాతాజీకి ఐదేళ్లపాటు గ్రావెల్ తవ్వుకునేందుకు లీజుకు ఇచ్చారు. లీజు గడువులోపు తాతాజీ గ్రావెల్ తవ్వకాలు చేసుకోలేదు. దాంతో లీజుగడువు ముగిసింది. అనంతరం తాతాజీ, అతడి సోదరుడు, మండపేట మండల ఎంపీపీ ఉండమట్ల వాసు ఇద్దరు కలిసి గడువు ముగిసినా 2024 వరకు అగ్రిమెంట్ ఉందని ఫోర్జరీ సంతకాలతో నోటరీతోపాటు తన సంతకం ఫోర్జరిచేసి మోసానికి పాల్పడ్డారని రైతు గంగధర్ ఆరోపించారు. తనపై గురువారం దాడికి ప్రయత్నించగా తాను తప్పించుకుని మండపేట రూరల్ పోలీసులకు ఎంపీపీతోపాటు అతడి సోదరుడు తాతాజీలపై కేసుపెట్టడం జరిగిందని గంగాధర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ, సోదరుడు తాతాజీల వల్ల తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాగా శుక్రవారం రాత్రి మండపేటలో ఉండమట్లవాసు, ఆయన అనుచరులతో విలేకరుల సమావేశం నిర్వహించి తాము 2015లో గ్రావెల్ తవ్వకాలకోసం గంగాధర్ వద్ద రూ.26.36 లక్షలకు లీజుకు తీసుకున్నామన్నారు. లీజుగడువు 2020 వరకు ఉందన్నారు. అనివార్యకారణాల వల్ల తాము తవ్వకాలు జరపలేదన్నారు. తాము రికార్డులను ఫోర్జరీ చేయలేదని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తాము గంగాధర్‌పై ఎటువంటి దాడికి పాల్పడలేదని వారు వివరించారు.



అమలాపురంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాల ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్ట్

అమలాపురం టౌన్, మార్చి 8: ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు దళాలు, కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలతోపాటు పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఈ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అమలాపురం పట్టణ పరిధిలోని కొంకాపల్లి, కురసాలవీధి, భూపయ్య అగ్రహారం, వడ్డిగూడెం, సూర్యనగర్, హైస్కూలు సెంటర్, విత్తనాల కాల్వగట్టు ప్రాంతాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ కిస్టఫర్‌తోపాటు పోలీసులు పాల్గొన్నారు.



రాజమండ్రి కోటిలింగాల రేవు వద్ద భక్తుల రద్దీ

రాజమండ్రి పుష్కరాల రేవు వద్ద భక్తులు

భక్తజన హోరు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



క్యూలో భక్తులు

కిక్కిరిసిన ద్రాక్షారామ

ద్రాక్షారామ, మార్చి 8: ద్రాక్షారామ భక్తజన సంద్రంగా మారింది. భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4.00 గంటల నుంచి భీమేశ్వర స్వామివారి దర్శనానికి భక్తుల రాక మొదలయ్యింది. ఉదయం 10 గంటల ప్రాంతానికి తీవ్ర రద్దీ నెలకొంది. క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మ వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రిపూజ నిర్వహించారు. 12 గంటలకు మహానివేదన చెల్లించారు. రాత్రి 1.30 వరకు స్వామిని భక్తులు దర్శించుకున్నారు. చండీ హోమ పండితులు ఇంద్రకంటి రామారావుశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో జ్యోతిర్లింగార్చన జరిగింది. ఆలయ ఉత్సవ అధికారి, దేవదాయశాఖ ఉప కమిషనరు ఎం.విజయరాజు పర్యవేక్షణలో, ఈవో పి.టి.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఇతర ఆలయాల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు సేవలు అందించారు.



పూలు, విద్యుత్ దీపాలతో అలంకరణ

అఖండ దీపారాధన

ద్రాక్షారామలో దక్షగుండం వద్ద వేంచేసియున్న ఘంటాంబిక అమ్మవారి ఆలయం వద్ద మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అఖండ దీపారాధన జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు, వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు అఖండ దీపారాధనను ప్రారంభించారు. కోటిపల్లి రోడ్డులో అమ్మవారి ఆలయ గోపురం వద్ద నుంచి ఆలయం వరకు ఇరువైపులా స్టాండ్లు ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. సుమారు 300 మీటర్లు పొడవునా ఇరువైపులా దీపారాధన జరిపారు. అదే విధంగా ఆలయం వద్ద శివలింగాలు చెక్కలతో ఏర్పాటు చేసి ప్రమిదలతో దీపాలు వెలిగించారు. ద్రాక్షారామ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుష్ప శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

భీమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సామర్లకోట, మార్చి 8: హరహర మహాదేవ శంభో శంకర అంటూ పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో క్యూలైన్లన్నీ కిక్కిరిసాయి. క్యూలైన్లు, వీఐపీ దర్శనాలకు ఏర్పాటు చేసిన మార్గాల వద్ద తీవ్రమైన రద్దీ, తొక్కిసలాటలు జరిగాయి. సకాలంలో పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. బందోబస్తు చర్యలను డీఎస్పీ కె.లతాకుమారి ఎప్పటికప్పుడు సమీక్షించారు. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల వద్ద తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దాతలు ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టాల వద్ద కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కెనాల్ రోడ్డు పొడవునా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో పలు దఫాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా సామర్లకోట మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆలయ ఆవరణలో సమగ్ర పారిశుధ్యచర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. భక్తుల క్యూలైన్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చీఫ్ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కుక్కుటేశుని నిజరూప దర్శనం

గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట నుంచి కుక్కుటేశ్వరస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వరస్వామికి లక్షబిల్వార్చన, రాజరాజేశ్వరీదేవి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జనసేన నియోజకవర్గ నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్నానాలాచరిస్తున్న భక్తులు

భక్తజన సంద్రం

..పాదగయ క్షేత్రం

పిఠాపురం, మార్చి 8: శివనామసర్మణతో పిఠాపురం మారుమోగింది. పట్టణ వీధులన్నీ భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలకు, కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం పిఠాపురం పట్టణం భక్త జన సంద్రమైంది. పాదగయ క్షేత్రానికి తరలివచ్చే రహదారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము సమయానికే పాదగయ బయట కిలోమీటరు మేర భక్తులు బారులు తీరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమయిన భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో సుమారు 3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి ఆది శంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ దత్తాత్రేయస్వామి అష్టాదశ శక్తిపీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను, ఇతర ఉపాలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కోటిపల్లి పుణ్యక్షేత్రం కిటకిట





క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కె.గంగవరం, మార్చి 8: కోటిపల్లి పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. స్వామి వారికి వేకువజామున గోదావరి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి బాలభోగం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ ఛాయా సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, దేవస్థానం ఈవో ఎం.శ్రీదేవి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆర్యవైశ్య సంఘం వారు, కాకతీయ సంఘం, శాలివాహన సంఘం, ఫైండా వారి అన్నసత్రం, మాన్సాస్ ట్రస్టుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోటిపల్లి ఫెర్రీ రేవులో తెలుగుదేశం పార్టీ నాయకుడు రేవు శ్రీను పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు శాఖ బందోబస్తు నిర్వహించింది. ఫెర్రీ రేవు, స్నానఘట్టాలు, రేవులోని బస్‌స్టాండ్, రేవులో నుంచి దేవస్థానానికి వచ్చే రహదారి, ఆలయం లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. పామర్రు ఎస్ఐ జానీ బాషా కంట్రోల్ రూం వద్ద నుంచి పరిస్థితిని పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ చేశారు. తహసీల్దార్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సేవలందించారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ అయినవిల్లి అబ్బు పూజలు చేశారు.

మహిళలు ఉచిత న్యాయ సహాయం పొందాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలు పొందడానికి మహిళలందరూ అర్హులేనని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా ప్రత్యేక కారాగారంలో నిర్వహించిన వేడుకలకు హాజరై మహిళా ఖైదీలు, జైలు సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కారాగారంలో ఉన్న మహిళలు ఏ విషయాల గురించీ ఆందోళన చెందవద్దన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాన్ని అవసరమైన మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మహిళలు, పిల్లలు, బడుగు బలహీన వర్గాలకు డీఎల్ఎస్ఏ అందిస్తున్న సేవల గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా మహిళలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఐజీ ఎంఆర్ రవికిరణ్, ఓఎస్‌జీసీ సీజీఎం మనీష శర్మ, జీఎం సంగీత సాహు, కారాగార సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ముమ్మిడివరంలో బాలయోగీశ్వరుల తీర్థం





ముమ్మిడివరం, మార్చి 8: శివరాత్రి తర్వాత రోజైన శనివారం జరిగే బాలయోగీశ్వరుల తీర్థం చాలా ప్రాముఖ్యమైనది. దీక్షలో ఉండగానే 1985 జూలై 19న పెదబాలయోగీశ్వరులు, ఆ తర్వాత 1991 అక్టోబరు 28న చినబాలయోగీశ్వరులు కైవల్య సిద్ధి పొందారు. వారిని తపో మందిరంలోనే సమాధి చేశారు. నేటికీ ఆ సమాధులను దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బాలయోగీశ్వరుల తీర్థాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరంలోని బాలయోగీశ్వరుల ఆశ్రమాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం శివరాత్రి సందర్భంగా బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 4 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మండపంపై బాలయోగీశ్వరుల విగ్రహ దర్శనం, సమాధుల దర్శనం ఉంటుంది. దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు వసతి, భోజనం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



అవార్డు అందుకుంటున్న రవితేజ

ఉత్తమ పోలీసు అధికారిగా వాసంశెట్టి రవితేజ

మామిడికుదురు, మార్చి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన వాసంశెట్టి రవితేజ ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. రవితేజ ప్రస్తుతం గుజరాత్‌లోని గాంధీనగర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. గురువారం జరిగిన సమావేశంలో గుజరాత్ రాష్ట్ర డీజీపీ వికాస్ సాహి నుంచి ఉత్తమ పోలీసు అధికారి అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని రవితేజ అందుకున్నారు. ఈ మేరకు ఆయన తండ్రి, హైకోర్టు న్యాయవాది వాసంశెట్టి నాగేశ్వరరావు వివరాలు తెలిపారు. కోనసీమలోని మారుమూల గ్రామంలో జన్మించిన రవితేజ 2015 ఐపీఎస్ బ్యాచ్ నుంచి ఎంపికై గుజరాత్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహించి అక్కడి ప్రజల మన్ననలు పొందారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఇతర రాష్ట్రంలో అవార్డు అందుకోవడంపై పెదపట్నంలంక గ్రామ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాన్-ఆటో ఢీ

పట్టుబడిన రేషన్ బియ్యం

గండేపల్లి, మార్చి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం జెడ్.రాగంపేట గ్రామ శివారులో శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడు వెళుతున్న వ్యాన్ జెడ్ రాగంపేట వచ్చేసరికి డివైడర్‌పైకి ఎక్కి రైలింగ్ దాటి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోతో పాటు మినీ వ్యాన్ బోల్తా పడింది. అయితే ఆటోలో రోడ్డు వర్కింగ్ కూలీలు నలుగురికి గాయాలయ్యాయి. వారిని పోలీసు హైవే పెట్రోలింగ్ సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఐషర్‌వ్యాన్‌లో ఉన్న రేషన్ బియ్యం బస్తాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే ఈ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. విజయవాడ నుంచి బి.ప్రత్తిపాడులోని ఒక షాపునకు బియ్యం తరలిస్తున్న బి. ప్రత్తిపాడుకు చెందిన వెలుగుల వాసుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ సీఐ రాజు, డీఎస్‌వో ప్రసాద్, సిబ్బంది బియ్యం స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేశారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

ఫైనాన్స్ కంపెనీలో రూ.12 లక్షల చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుల దృశ్యాలు

రాజమహేంద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నీసుపేట పాత స్టేట్‌బ్యాంకు మొదటి అంతస్తులో ఒక ఫైనాన్సు కంపెనీ కార్యాలయం ఉంది. అందరూ శివరాత్రి హడావుడిలో ఉండగా అగంతకులు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఇనుపరాడ్డుతో షట్టరును బలవంతంగా మనిషి దూరే ఎత్తుకు పైకిలేపి లోనికి ప్రవేశించారు. లోపల టేబుల్ సొరుగు తాళాన్ని స్క్రూడ్రైవర్లతో తొలగించి సుమారు రూ.12 లక్షల నగదును అపహరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వాళ్ల ఫొటోలను ఎస్పీ జగదీశ్ మీడియాకు విడుదల చేశారు. దొంగల ఆచూకీ తెలిపిన వారికి రూ.20 వేల బహుమతి అందజేస్తామని ప్రకటించారు. టూటౌన్ సీఐ ఫోన్ 9440796576 లేదా సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఫోన్ 9490760791కి సమాచారం అందించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారి వివరాలు గోప్యంతా ఉంచుతామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఆటో డ్రైవర్ మృత్యువాత



గొల్లప్రోలు, మార్చి 8: ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ మరణించాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఇసుకపల్లికి చెందిన రాయి సూర్యచంద్ర(32) పిఠాపురం నుంచి గొల్లప్రోలుకు ఆటో నడుపుకుంటూ వెళుతుండగా, బైపాస్ రోడ్డులో వై జంక్షన్ వద్దకు వచ్చేసరికి కత్తిపూడి నుంచి పిఠాపురం వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ సూర్యచంద్రను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శివునిలో సగం..అవనిలో సగం

రంగంపేట, మార్చి, 8 : మహాశివరాత్రి, మహిళా దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రంగంపేటకు చెందిన ప్రముఖ సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ 150 సంవత్సరాల చరిత్ర కలిగిన రంగంపేట శివాలయంలో అమ్మవారి సైకత శిల్పాన్ని పండ్లు, కూరగాయలతో చెక్కారు. శివునిలో సగం - అవనిలో సగం మేమే.. అనే నినాదంతో వినూత్నంగా తీర్చిదిద్దారు.

వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తజనం

ఆత్రేయపురం, మార్చి 8: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి రుద్రాభిషేకం నిర్వహించారు.వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్పాలతో అలంకరించినశివలింగం వద్ద ఫొటోషూట్ ఏర్పాటుచేశారు. వేలాదిమంది భక్తులు శివుడ్నిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఛైర్మన్, ఈవో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

హర హర మహాదేవ






అమలాపురం: సర్వమంగళ రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు, కోటిపల్లి: కోటిదీపారాధన పూజలు, కాట్రేనికోన: కుండలేశ్వరస్వామి, కొత్తపేట: పలివెల ఉమాకొప్పేశ్వర శివలింగానికి పంచామృతాభిషేకాలు

అమలాపురం టౌన్/రూరల్, మార్చి 8: ఓం నమఃశివాయ అంటూ శివపంచాక్షరితో పరమశివుని స్తుతిస్తూ భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి బారులు తీరి సదాశివుని దర్శించుకున్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని శివనామస్మరణలతో భక్తజనం పులకించారు. శివాలయాల్లో రుద్రం-నమకం-చమకం పారాయణాలు చేశారు. అభిషేక ప్రియుడైన పరమశివునికి అభిషేకాలు చేసేందుకు భక్తులు తరలివచ్చారు. అమలాపురంలో శ్రీపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం వందలాది మంది భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. కారుపర్తి తేజేశ్వరశర్మ, పడవల గణపతిల ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. కూచిమంచివారి అగ్రహారంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు జరిగాయి. నడిపూడి శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు స్వయంగా గర్భగుడిలో శివలింగాన్ని తాకి ప్రత్యేక అభిషేకాలు జరిపించుకున్నారు. శివలింగ స్పర్శతో భక్తులు పులకించిపోయారు. అమలాపురంలో పురాణ ప్రసిద్ధి నొందిన శ్రీభ్రమరాంబికా సమేత చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. రవణంవీధిలోని శ్రీసర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం ఛైర్మన్ మాచిరాజు రవికుమార్, నాగవల్లి దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతిహోమం నిర్వహించారు. తెల్లవారుజామునుంచి స్వామివారికి ప్రత్యేకఅభిషేకాలు జరిగాయి. రాత్రి అఖండ దీపారాధ నల అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. సమనస-రంగాపురంలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వెలవలపల్లి సత్యనారాయణశర్మ ఆచార్యబ్రహ్మత్వంలో జరిగిన పూజాకార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయం వద్ద చింతపట్ల సత్యనారాయణ, సీతారత్నం దంపతులతో పార్వతీ పరమేశ్వరుల దివ్యకల్యాణాన్ని గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో నిర్వహించారు. మురుగులమ్మగుడిసెంటర్‌లోని శ్రీబాలాత్రిపుర సుందరీసమేత ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు.బండారులంక శ్రీభద్రకాళీ సమేత వీరభద్రే శ్వరస్వామి ఆలయంవద్ద కొండా పెద్ద దంపతులతో అంకం నాగమల్లేశ్వరరావు బ్రహ్మత్వంలో శివ పార్వతుల కల్యాణం జరిపించారు. జ్యోతిర్లింగదర్శనం ఆకట్టుకుంది.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబాభీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచి భక్తులు భీమేశ్వరస్వామిని పూజించుకునేందుకు బారులు తీరారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భీమేశ్వరుని దర్శించుకున్నారు. చీకట్లపాలేనికి చెందిన పోలిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో వరుసగా 51వఏడాది భారీ అన్నసమారాధన కొనసాగింది. మునిపల్లి పార్వతీమల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పూజలు జరిగాయి. అన్నసమారాధన జరిగింది. విలసవిల్లిలో 1,156 మట్టి శివలింగాలతో శివార్చన చేశారు. మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తులు ఉదయం నుంచి అభిషేక పూజల కోసం బారులుతీరారు.

కాట్రేనికోన: కుండలేశ్వరంలో భక్తులు పోటెత్తారు. వృద్ధగౌతమిలో స్నానాలాచరించిన భక్తులు కుండలేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరారు. రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాళ్ళకూరి కామేశ్వరరావు బ్రహ్మత్వంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. విశాఖకు చెందిన భక్తులు కుండలేశ్వరంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మగసానితిప్ప శివాలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు. బలుసుతిప్ప శ్రీకాళభైరవ అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది. చెయ్యేరు, ఉప్పూడి, లక్ష్మీవాడ, కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, పల్లంకుర్రు శివాలయాల్లో శివరాత్రి పూజలు జరిగాయి. కాట్రేనికోన మావుళ్ళమ్మకు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

రామచంద్రపురం: పట్టణంలోని బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, ముచ్చుమిల్లిలో గల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటుచేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వరకు క్యూలైన్‌లో భక్తులు నిలిచి స్వామిని దర్శించుకున్నారు.

ముమ్మిడివరం: శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. శైవక్షేత్రాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున పవిత్ర గోదావరి జలాల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరరావు, అయినాపురంలో ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వర స్వామి, కొత్తలంకలో ఉమాకోటేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేలంకలో ఉమాసోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరంలోనిఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. ఆర్యవైశ్య సత్రంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో అభిషేక లింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, వజ్రపు లింగం ఏర్పాటుచేశారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, బ్రహ్మకుమారి బీకే ఉమ, బ్రహ్మకుమారీలు ద్వాదశ లింగ దర్శనం చేసుకుని పూజలు జరిపించారు.

మలికిపురం: శివరాత్రి పర్వదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. మోరి, లక్కవరం, మలికిపురం, కేశనపల్లి, బట్టేలంక గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. సాయంత్రం మండల పరిధిలోని పలు గ్రామాల ఆలయాల్లో దీపాలంకరణలు చేశారు.

రాయవరం: సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమాసోమేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. లొల్ల రామలింగేశ్వరస్వామి, రాయవరం రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి, వెదురుపాక శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సోమేశ్వరంలో మహాశివరాత్రి కమిటీ ఆధ్వర్యాల్లో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగలకుర్రుఅగ్రహారం శివకేశవుల ఆలయంలో స్వామివార్కి రుద్రాభిషేకం, హోమం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి వ్యాఘ్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాచీన దేవాలయం కావడంతో స్వామి వార్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గంగలకుర్రు, మొసలపల్లి, వ్యాఘ్రేశ్వరం, మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామల, నందంపూడి, ఇరుసుమండ, వక్కలంక గ్రామాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. అనంతరం ఆలయాల వద్ద భక్తులు వివిధ రూపాలతో స్వామి వార్ల ప్రతిమలను తయారుచేసి దీపాలను వెలిగించారు.

అల్లవరం: ఎస్.రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, పలు శివాలయాల్లో అభిషేకాలు, దర్శనాలకు భక్తులు పోటెత్తారు. ఎస్.రామేశ్వరం సముద్ర తీరంలో వేలాదిగా భక్తులు సముద్రస్నానాలు ఆచరించారు. ఎస్.రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, బోడసకుర్రు, గోడి, గోడిలంక, దేవగుప్తం, అల్లవరం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, తాడికోన గ్రామాల్లోని శివాలయాల్లో వేకువజాము నుంచి అభిషేకాలు జరిగాయి. శివనామస్మరణతోశివాలయాలు మార్మోగాయి. జ్యోతిలింగార్చనలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్లు అంగాని రామారావు, నామన బాలభాస్కరసిద్ధాంతి, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఆత్రేయపురం: వసంతవాడ పార్వతీ పరమేశ్వర్లు కరెన్సీ నోట్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. టీడీపీ, జనసేన అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీ నేతలతో వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. సాయంత్రం దీపాలంకరణ నిర్వహించారు వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో శివునికి అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రసాద వితరణ చేశాయి.

రావులపాలెం: మండలంలోని శివాలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివార్లకు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల నుంచి 12గంటల వరకూ స్వామివారికి రుద్రాభిషేకం,హారతి, పూర్ణాలంకరణ, నివేదన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కొత్తపేట: శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. పలివెల శ్రీఉమాకొప్పిలింగేశ్వరస్వామి, మందపల్లి మందేశ్వర, శనేశ్వరస్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి శైవక్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. పలివెలలో స్వచ్ఛంద సంస్థలు భక్తుల ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానసత్రం ద్వారా భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ భమిడిపాటి లక్ష్మీనారాయణ, ఈవోలు కృష్ణచైతన్య, కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించారు.

ఆలమూరు: శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, చింతలూరు పృధ్వీశ్వరస్వామి, చొప్పెల్ల మల్లేశ్వరస్వామి, మడికి సోమేశ్వరస్వామి, మూలస్థానం మూలేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు అభిషేకాలు జరిగాయి. నవాబుపేట, బడుగువానిలంక, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, కలవచర్ల గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. మూలస్థానంలోని మూలేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయాల మార్కెట్‌లో ఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. వేలాది మందికి అన్నసమారాధనను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజవకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువజామునే కపిలేశ్వరపురం గౌతమీ నదిలో స్నానమాచరించి అగస్త్యేశ్వర పాపవినాసేశ్వర స్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంగర ఖణ్వలింగేశ్వరస్వామి, కోరుమిల్లి సోమేశ్వరస్వామి, పడమరఖండ్రిక ఉయ్యాల- జంపాల క్షేత్రం వద్ద అన్నపూర్ణసమేత త్రయంబకేశ్వరస్వామి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివార్లను భక్తులు దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధననిర్వహించారు. రాత్రి కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ప్రమిదలతో దీపాలంకరణ చేశారు. ఉయ్యాల-జంపాల క్షేత్రం వద్ద నున్న త్రయంబకేశ్వరస్వామిని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు స్వామివారిని దర్శించుకున్నారు.

యానాం: స్థానిక శివాలయం ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి సహిత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులుపూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఫెర్రీరోడ్డులోని పుష్కర ఘాట్ వద్ద గల శివాంహోలీబాత్ వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. నల్లం కుటుంబ సభ్యులు భారీ క్రేన్ సహాయంతో శివాంహోలీబాత్‌పైకి వెళ్లి పూజలు, అభిషేకాలు చేశారు.

పి.గన్నవరం: శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం అలంకరణలు చేశారు. ఉడిమూడిలో పార్వతిమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముంగెడపులంక, మానేపల్లి, ముంగండ, పోతవరం, నరేంద్రపురం, బెల్లంపూడి, కారుపల్లి, వై.కొత్తపల్లి తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం దీపాలంకరణలు నిర్వహించారు. గ్రామాల్లో స్థానిక దేవాలయాల్లో కూడా ప్రత్యేక దీపాలంకరణలు చేశారు.

కె.గంగవరం: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో కోటి దీపారాధన వైభవంగా నిర్వహించారు. బేడా మండపంపై స్వామి వారి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం కోటి దీపారాధన ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఆర్డీవో సుధాసాగర్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ట్రస్టుబోర్డు ఛైర్మన్ పిల్లి శ్రీనివాసు పాల్గొన్నారు. పామర్రు ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తులు జ్యోతిర్లింగార్చన చేశారు. ప్రమిదలను శివలింగాకారంలో ఏర్పాటుచేసి దీపాలు వెలిగించారు. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, దంగేరు, గంగవరం, బాలాంత్రం, యర్రపోతవరం, కుందూరు, భట్లపాలిక, మసక పల్లి గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి.

మండపేట: వేకువజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. మండపేటలో అగస్త్యేశ్వరస్వామివారి ఆలయం, ఏడిద సంగమేశ్వరస్వామివారి ఆలయం, తాపేశ్వరం అగస్త్యేశ్వరస్వామి ఆలయం, అర్తమూరు, ద్వారపూడి, ఇప్పనపాడు, కేశవరం, వెలగతోడు, పాలతోడు, మెర్నిపాడు, వై.సీతానగరం తదితర గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలు దేవాలయాలు వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

రాజోలు: శివకోటి, కడలి, పొన్నమండ, తాటిపాక, రాజోలు తదితర ప్రాంతాల్లోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే పలు ఆలయాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. హరహర మహదేవ శంభోశంకర అంటూ భక్తులు ఆలయాల్లో ప్రదక్షిణలు చేశారు. రాత్రి ఆలయాల వద్ద దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

అంతర్వేది: అంతర్వేది పుణ్యక్షేత్రంలో క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. రామేశ్వరం, సఖినేటిపల్లి, మోరి, అంతర్వేది తదితర శివాలయాల్లో భక్తులు స్వామి దర్శనానికి క్యూకట్టారు. నందీశ్వరుని వద్ద భక్తులు దీపారాధనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, దేవస్థానం, గుడిమూల, సఖినేటిపల్లి, మోరి, వీవీమెరక, టేకిశెట్టిపాలెం, కేశవదాసుపాలెం గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా దీపాలు వెలిగించి శివరాత్రి పండుగను వైభవంగా జరిపారు. అంతర్వేది దేవస్థానం క్షేత్ర పాలకుడి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

మహిళల కలల సాకారం టీడీపీ, జనసేనతోనే సాధ్యం



మలికిపురం, మార్చి 8: మహిళల కలల సాకారం తెలుగుదేశం-జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాండ్రేగుల భవానీలావణ్య అన్నారు. శుక్రవారం జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, కొండేటి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో లక్కవరం ఎంసీ గార్డెన్స్‌లో కేక్ కట్‌చేసి మహిళా నాయకులు దువ్వాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో మహిళలకు గౌరం టీడీపీ హయాంలోనే లభించిందన్నారు. సర్పంచ్‌లు కోట పుష్పకుమారి, చెల్లుబోయిన హెలీన, కడలి కనకదుర్గ, మోకా పార్వతి, మట్టపర్తి లక్ష్మి, అడబాల రమాదేవి, ముత్యాల దుర్గాదేవి, జాంబవరి, చెల్లి సీతామహలక్ష్మి, ఎంపీపీ కేతా శ్రీనివాస్, చాగంటి స్వామి, పిండి సత్యనారాయణ, రాపాక ఆనంద్‌కుమార్, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమలాపురం టౌన్, మార్చి 8: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, విద్యార్థినుల సమక్షంలో వారు భారీ కేక్‌ను కట్ చేశారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ ఎండీ కె.రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ అశోకచక్రవర్తి, నర్సింగ్ ప్రిన్సిపాల్ స్వప్నకుమారి, జనరల్ మేనేజర్ రాధామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు

కిమ్స్ వైద్య కళాశాలలో అమలాపురం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ప్యానల్ లాయర్లు కేవీవీ శ్రీనివాసరావు, వర్రే సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి డీవీవీఎస్ మూర్తి, తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబులు మహిళల కోసం అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ యాజమాన్యంతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి సాధిస్తేనే నిజమైన స్వాతంత్ర్యం

ముమ్మిడివరం, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే వారికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని లేబర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రెడ్డి నాగార్జున పేర్కొన్నారు. పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, చైతన్య వలంటీరీ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అయినాపురం కోమటిచెరువు జడ్పీ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాది టి.నాగరాజారావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో నాగార్జునరావు మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కె.రమాదేవి, జె.సుజాత, పి.రజనీ, డి.పద్మలను సత్కరించారు. ముమ్మిడివరంలోని వైసీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. హితకారిణి సమాజ్ ఛైర్‌పర్సన్, కోనసీమ జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు.

జగన్ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు

ఉప్పలగుప్తం, మార్చి8: జగన్ పాలనలో రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని పీసీసీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు ఆరోపించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1975లోనే మహిళల కోసం డ్వాక్రా పథకాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. వంటగ్యాస్ ధర తగ్గిస్తారన్నారు.

సిద్ధార్థ గౌతమ్ మృతికి సంతాపం

అమలాపురం టౌన్, మార్చి 8: ఆర్పీఐ రాష్ట్ర నాయకుడు, బౌద్ధ ఉపాసకుడు మట్టా సిద్ధార్థగౌతమ్ అకాల మృతికి శుక్రవారం పట్టణ పరిధిలోని సావరంలో ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సిద్ధార్థగౌతమ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బుద్ధిజంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు.

బుచ్చిబాబు ఎన్నికల ప్రచారం



పూజలు చేస్తున్న దాట్ల బుచ్చిబాబు, హరీష్‌మాధుర్

కాట్రేనికోన, మార్చి 8: టీడీపీ-జనసేన ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు శుక్రవారం మగసానితిప్ప కాళభైరవస్వామిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి అశోక్, దాట్ల పృథ్వీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిబాబు విజయానికి కృషి చేద్దాం

నగర పంచాయతీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తీర్మానం

ముమ్మిడివరం, మార్చి 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ముమ్మిడివరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు విజయానికి నిబద్ధతతో పనిచేయాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తీర్మానించారు. ముమ్మిడివరంలో శుక్రవారం నగర పంచాయతీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు సమావేశమయ్యారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయించి ఎక్కువ మెజార్టీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, కడలి సౌజన్య, కట్టా ఉమామహేశ్వరి, మాదాల నాగసత్యమంగాకుమారి, మాజీ కౌన్సిలర్ జగతా గోవిందరావు, శీలం కృష్ణమూర్తి, నాయకులు కడలి నాగు, కట్టా సత్తిబాబు, మాదాల బుజ్జి, విళ్ల వీరాస్వామినాయుడు, పితాని నరసింహమూర్తి, గొల్లపల్లి గోపి, ఎస్ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలభైరవస్వామిని దర్శించుకున్న బుచ్చిబాబు

ఐ.పోలవరం, మార్చి 8: భైరవపాలెం మత్స్యకారుల ఆరాధ్యదైవం కాలభైరవ స్వామిని అసెంబ్లీ జనసేన-టీడీపీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు కార్యదర్శిగా కాశీ

మామిడికుదురు, మార్చి 8: ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు కార్యదర్శిగా మొగలికుదురుకు చెందిన పోతు కాశీని నియమించారు. నియామక పత్రాన్ని కాపునాడు అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నుంచి శుక్రవారం అందుకున్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన గంగుమళ్ల శ్రీను, కాకిలేటి దుర్గారావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

మామిడికుదురు, మార్చి 8: శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన సెట్టింగ్స్ భక్తులను ఆకట్టుకున్నాయి. మొగలికుదురులోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. అప్పనపల్లి మైనరురాజు ఆధ్వర్యంలో శ్రీబాలగణపతి మిత్ర బృందం ఆధ్వర్యంలో 10,116 దీపాలతో ఏర్పాటుచేసిన అలంకరణ, సంతపేటలో శ్రీగౌరీశంకర భక్త బృందం ఏర్పాటుచేసిన దీపాలంకరణ ఆకట్టుకున్నాయి. పెదపట్నంలంలోకి శివాలయం వద్ద భక్తులు ఏర్పాటుచేసిన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాశర్లపూడిలంకలోని నాగేంద్రస్వామి ఆలయంలో నాగ ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని నిర్వహించారు. పాశర్లపూడి, మగటపల్లి, పాశర్లపూడి బాడవవ గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శతశివలింగాల దివ్య దర్శనం

అమలాపురం టౌన్, మార్చి 8: బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలను బీకే శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి శత శివలింగాల దివ్య దర్శనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, చిల్లా పురుషోత్తం, అడపా బాబులు, పందిరి శ్రీహరి, చెల్లుబోయిన శ్రీనివాస్, దంగేటి డోలామణి, కల్వకొలను చాయాదేవి, దంగేటి రుద్ర తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈసందర్భంగా శివలింగాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మహాశివరాత్రి పురస్కరించుకుని కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థిని శివుని వేషధారణతో చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రభుత్వ విధానాలతో విసుగుచెంది టీడీపీలో చేరికలు

ఆత్రేయపురం, మార్చి 8: జగన్ ప్రభుత్వంపై విసుగుచెందిన ప్రజలంతా టీడీపీ గూటికి వస్తున్నారని టీడీపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం పేరవరం, వసంతవాడ గ్రామాల నుంచి వైసీపీని వీడి టీడీపీలో చేరారు.పెన్మత్స వెంకటసూర్యనారాయణరాజు, రామలింగరాజు, రాధాకృష్ణంరాజు, ఫణి, పేరిచర్ల రమేష్, సీతారామరాజు, మార్గాని గోపి, రాజేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఇటీవల పేరవరంలో టెంట్‌సామగ్రి దగ్ధమై భారీగా ఆస్తినష్టం చేకూరింది. బాధితుడు చిట్టూరి ఉదరాజును బండారు పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు.సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముళ్ళపూడి భాస్కరరావు, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి, వెంకన్న, చల్లపూడి నాగేష్ పాల్గొన్నారు.

మూలస్థానంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



ఆలమూరు, మార్చి 8:మూలస్థానఅగ్రహారంలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బండారు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, మార్చి 8: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నారాయణలంకలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఆయన ఇంటింటా పర్యటిస్తూ టీడీపీ-జనసేన ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే వేగుళ్లకు ప్రజలు అడుగడుగునా స్వాగతం పలుకుతూ సాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గ్రామజనసేన పార్టీ అధ్యక్షుడు కుప్పాల వీరబాబు, టీడీపీ గ్రామఅధ్యక్షుడు పిల్లా శ్రీను, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, టీడీపీ నాయకులు పువ్వల చిట్టిబాబు, జి.త్రిమూర్తులు, గుడాల జయబాబు, బలవరెడ్డి సత్తిబాబు, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల అభ్యున్నతికి కలల రెక్కల పథకం దోహదం

రావులపాలెం, మార్చి8: చదువుకునే ఆడబిడ్డల అభ్యున్నతికి కలల రెక్కల పథకం ఎంతగానో దోహదపడుతుందని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కొత్తకాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి హాజరైన మహిళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్ పూర్తయిన ఆడబిడ్డల వృత్తి విద్యా కోర్సుల బాధ్యత టీడీపీ, జనసేన తీసుకుంటుందన్నారు. ఆడపిల్ల చదువు ఆర్థిక కారణాలతో ఆగిపోకూడదన్నారు. దండంగి మమత, కుక్కల రాణి, రమణీదుర్గ, బూసి విజయప్రసున్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన డాక్టర్ కాదా

మండపేట, మార్చి9: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత డాక్టర్ కాదా వెంకటరమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట టీడీపీ నేతలు విత్తనాల వెంకటరమణ, వాకలపూడి జయశంకర్, కడిలి గోవిందు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

అమలాపురం టౌన్, మార్చి 8: అమలాపురం నల్లవంతెన వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ పామర్తి జానకీరమేష్‌నాయుడు(31) అక్కడికక్కడే మృతిచెందాడని పట్టణ సీఐ కె.కిస్టఫర్ తెలిపారు. రమేష్‌నాయుడు మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడు మృతిచెందాడు. అతడికి భార్య అనంతలక్ష్మీ, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రమేష్ మృతికి కోనసీమ మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ సంతాపం తెలిపి ల్యాబ్స్ మూసివేశారు.

గుండెపూడిలో తవ్వకాల్లో బయటపడ్డ నంది విగ్రహం



అల్లవరం మార్చి 8: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుండెపూడి గ్రామంలో శుక్రవారం తవ్వకాలు జరుపుతుండగా అతి పురాతన నంది విగ్రహం బయట పడింది. గుండెపూడిలో మేజర్ డ్రెయిన్ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు గొయ్యి తవ్వుతుండగా పురాతన నంది విగ్రహం బయట పడింది. మహాశివరాత్రి పర్వదినాన నంది విగ్రహం బయట పడడంతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. విగ్రహాన్ని చూసేందుకు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు.

ఘనంగా రథోత్సవం

అంతర్వేది, మార్చి 8: గుడిమూలలో గురువారం రాత్రి జరిగిన కృతకృత్య రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగి ఓం నమఃశివాయ అంటూ స్వామివారి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలికపై అత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ

యానాం, మార్చి 8: పుదుచ్చేరిలో బాలికపై అత్యాచారాన్ని నిరసుస్తు యానాం యువత ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి ర్యాలీ యానాం పురవీధుల్లో సాగింది. యువత ప్రతినిధులు మల్లావరపు దయ, కిరణ్, మల్లాడి వెంకట్, వినయ్, వాసు మాట్లాడుతూ ఈఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

పోయిన ఆభరణం దొరికింది

ఐ.పోలవరం, మార్చి 8: తనకు దొరికిన బంగారు ఆభరణాన్ని పూలవ్యాపారి నిజాయతీగా యజమానికి అప్పగించాడు. హైదరాబాదుకు చెందిన దంపతులు గురువారం రాత్రి మురమళ్ళ వీరేశ్వరస్వామి కల్యాణానికి వచ్చారు. కల్యాణం అనంతరం చేతికి ఉన్న బ్రాస్‌లెట్ కన్పించకపోవడంతో ఆలయ అధికారులకు సమాచారం అందించారు. పూల దుకాణం దగ్గర పోగొట్టుకున్నట్టు ఊహించి ఆ దిశగా అన్వేషణ ప్రారంభించారు. దుకాణం యజమానురాలు పోలిశెట్టి అనంతలక్ష్మీశ్రీనివాస్ తనకు దొరికిన ఆభరణాన్ని యజమానికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. పూలవ్యాపారిని పలువురు అభినందించారు.